# పార్టీ మారనందుకు కాంగ్రెస్ కౌన్సిలర్ దంపతుల వేధింపులు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించి ఉద్యోగం తొలగింపు
- అయినా ససేమిరా అనడంతో ఇంటిపై దాడి
- ప్రాణహాని ఉందన్న బాధితుడు అన్వర్

నీలగిరి, నవంబర్ 13 : తమతో పాటు పార్టీ మారనందుకు కక్ష పెంచుకుని ఓ ముస్లిం కుటుంబాన్ని కాంగ్రెస్ కౌన్సిలర్ దంపతులు వేధింపులకు గురిచేస్తున్నారు. ఇంట్లోని వ్యక్తి ఉద్యోగం ఊడగొట్టియడంతో పాటు ఇంటి మీదకు వెళ్లి భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటన నల్లగొండ పట్టణం 16వ వార్డు ఆర్జాలబావిలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. 16వ వార్డు కౌన్సిలర్ జేరిపోతుల అశ్వినీభాస్కర్‌గౌడ్ బీఆర్ఎస్‌ను వీడి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే కౌన్సిలర్ వెంట శ్రేణులెవరూ కూడా కాంగ్రెస్‌లో చేర లేదు. నల్లగొండ మున్సిపాలిటీలో జవాన్‌గా పనిచేసే (అవుట్ సోర్సింగ్) వ్యక్తి, అదే వార్డు వాసి షేక్ అన్వర్‌కు స్థానికంగా మంచి పేరున్నది. ఆ పేరును కౌన్సిలర్ దంపతులు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అన్వర్‌ను కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఒత్తిడికి గురిచేశారు. దాంతో వార్డులో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తమకు అన్యాయం చేయలేదని పేర్కొంటూ వారి ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు. దాంతో కౌన్సిలర్ దంపతులు అన్వర్‌పై కక్ష పెంచుకున్నారు. తన వెంటే పార్టీ ఫిరాయించిన తమ సామాజిక వర్గానికే చెందిన సహచర కౌన్సిలర్ సహకారంతో అన్వర్‌ను ఉద్యోగం నుంచి తొలగింపజేశారు. అయినా కూడా అన్వర్ తమ దారికి రాకపోవడంతో కౌన్సిలర్ భర్త, అనుచరులు అన్వర్ ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టి అన్వర్ తల్లి దుస్తులు సైతం చింపివేశారు. దాంతో కాలనీవాసులు అంతా ఏకమై అన్వర్ కుటుంబానికి అండగా ఉండి దాడిని నిలువరించి కౌన్సిలర్ దంపతులు, అనుచరులను అడ్డుకున్నారు. విషయం తెలిసిన పట్టణ ముస్లింలు అన్వర్ ఇంటికి చేరుకున్నారు. అనూహ్య పరిణామానికి కంగుతిన్న కౌన్సిలర్ దంపతులు వెంటనే తన సామాజిక వర్గానికి చెందిన మరో కౌన్సిలర్‌కు ఫోన్ చేసి విషయం తెలుపగా ఆ కౌన్సిలర్ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దాంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన అనుచరులు పలువురితో కలిసి నేరుగా సంఘటనా స్థలానికి చేరుకుని కౌన్సిలర్‌పైనే దాడి జరిగినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ముస్లిం యువకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆర్జాలబావికి రావడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను పంపించి వేశారు. అనంతరం ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాలపై నల్లగొండ రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు.



ఆందోళనకు దిగిన అన్వర్ కుటుంబ సభ్యులు, స్థానికులు

### కౌన్సిలర్ దంపతుల నుంచి నాకు ప్రాణహాని

కౌన్సిలర్ దంపతులు తాను పార్టీ మారనన్నందుకు ఉద్యోగం నుంచి తొలగించడమే కాక నా కుటుంబంపై అకారణంగా దాడి చేశారు. భాస్కర్ పార్టీ మారినప్పటి నుంచి తనను కూడా పార్టీ మారాలని పలుమార్లు హెచ్చరించాడు. అయినా వారి మాట లు విననందుకు నాపై, నా కుటుంబంపై దాడి చేశారు. వార్డులో తన ప్రాబల్యం తగ్గిందని, ఓటమి భయంతోనే నాపై దాడి చేశారు. కౌన్సిలర్ దంపతుల నుంచి నా ప్రాణహాని ఉంది. పోలీసులు రక్షణ కల్పించాలి.

– షేక్ అన్వర్

# నల్లగొండకు పట్టిన పీడ కోమటిరెడ్డి బ్రదర్స్

- రూ.15 కోట్లు తీసుకుని వీరేశానికి టికెట్ ఇప్పిచ్చిండ్రు
- 12 మంది ఎమ్మెల్యేలను బేరం పెట్టింది నువ్వు కాదా?
- ప్రాజెక్టుల పేరుతో కోట్లు కొల్లగొట్టారు
- నల్లగొండకు పట్టిన పీడ కోమటిరెడ్డి బ్రదర్స్
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రసన్నరాజ్

నకిరేకల్, నవంబర్ 13 : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి బ్రదర్స్ రాజకీయ వ్యభిచారులు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రసన్న రాజ్ అన్నారు. పార్టీ నకిరేకల్ కార్యాలయంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, చెరుకు సుధాకర్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నల్లగొండకు పట్టిన పీడ కోమటిరెడ్డి బ్రదర్స్ అని, ప్రాజెక్టుల పేరుతో కోట్లు కొల్లగొట్టారన్నారు. ఆరోపణలు అవాస్తవమైతే ఇందిరాగాంధీ సెంటర్‌కు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. బీసీలకు టికెట్ ఇస్తానని చెప్పి ముందే నామినేషన్ వేసిన వ్యక్తి వెంకట్‌రెడ్డి అని దుయ్యబట్టారు. నకిరేకల్‌లో కాంగ్రెస్ టికెట్‌ను బీజేపీలో ఉన్న రాజగోపాల్‌రెడ్డి డిసైడ్ చేసినట్లు చెప్పారు. కార్పొరేట్ తరహాలో వారికి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా డబ్బులు ముట్టినట్లు ఆరోపించారు. వెంకట్‌రెడ్డి తోటలో మీటింగ్ పెట్టి వీరేశం తీవ్రవాది, అరాచకవాది, ఖూనీకోరు వాడు కాంగ్రెస్‌లోకి వస్తే నిన్ను సంపుతడు.. నన్ను సంపుతడు అని అందరికీ చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మొబిలైజేషన్ పేరుతో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి కోమటిరెడ్డి బ్రదర్స్ కోట్లకు పడగెత్తినట్లు చెప్పారు. వీరు పార్టీనే నమ్ముకుని ఏండ్లుగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. అలా నిరాదరణకు గురైన వ్యక్తుల్లో తాను ఒకడినని, కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారి ఆలోచన చేయాలని సూచించారు.

### 'అరాచకానికి మారుపేరు కోమటిరెడ్డి బ్రదర్స్'

నల్లగొండ సీటు బీసీలకు కేటాయిస్తానని ప్రగల్భాలు పలికి ఇప్పుడు ఆయనే బరిలో నిలిచిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీరు హాస్య స్పందంగా ఉందన్నారు. నల్లగొండకు పట్టిన పీడ కోమటిరెడ్డి బ్రదర్స్ అని, అన్నీ పార్టీలతో సంబంధాలు పెట్టుకుంటారని, అవకాశవాదులని, ఆర్థిక అరాచకత్వానికి మారు పేరు కోమటిరెడ్డి బ్రదర్స్ అన్నారు. ప్రాజెక్టుల పేరుతో డబ్బులు దండుకున్నారన్నారు. తనలాంటి వద్ద డబ్బులు తీసుకుని ఆపదలో ఉన్న వారికి రూ.50 వేలు, లక్ష ఇచ్చి ఫొటోలతో ఫోజులిచ్చేవారన్నారు. తాను చేసిన ఆరోపణలు తప్పని తేలితే నకిరేకల్ ఇందిరాగాంధీ సెంటర్‌లో ముక్కు నేలకు రాసి రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. దమ్ముంటే చర్చకు రావాలని తాను అన్ని ఆధారాలతో వస్తానని సవాల్ విసిరారు. మునుగోడు బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారని, ఇంతటి రాజకీయ వైరుధ్యం ఉన్న పనులు చేసేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్‌కు సిగ్గు అనిపించట్లేదా అని ప్రశ్నించారు.

నకిరేకల్ ప్రజలు, దళిత, బహుజన బిడ్డలు ఒక్కసారి ఆలోచించి కోమటిరెడ్డి బ్రదర్స్‌ను అడుగడుగునా ఎండగడుతూ రాజకీయంగా బట్టలు ఊడగొడితే తప్ప రాజకీయ చైతన్యం నిలుపుకోలేమన్నారు. సమావేశంలో కల్లుగీత కార్పొరేషన్ నకిరేకల్ అధ్యక్షుడు కొండ జానయ్య, నాయకులు మురారిశెట్టి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న పాల్గొన్నారు.



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న అర్చకులు

## రామలింగేశ్వరుడికి లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి నవంబర్ 13 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం అమావాస్య కావడంతో దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ నవీన్ కుమార్ భక్తులకు మౌలిక వసతులు కల్పించారు.

## ఆర్థిక సాయం

కట్టంగూర్, నవంబర్ 13 :మండలంలోని పరడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రత్నం రవి ఇటీవల మృతి చెందారు. లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఇద్దరి కూతుళ్ల పేరు మీద తపాలా కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు కాసర్ల గౌతంరెడ్డి, గోలి రవీందర్ రెడ్డి, టేకుల శ్రీవాస్, జీడిపల్లి లింగారెడ్డి, గణేశ్, సైదులు, నర్సిరెడ్డి, ఉపేందర్, వెంకన్న, సతీశ్, లింగంయాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన మట్టిపల్లి సైదులు కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. గ్రామస్తులు రూ. 51,633 లను సైదులు కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆధ్యాత్మికం..కార్తీకం

- నేటి నుంచి ఆలయాల్లో కార్తిక మాస పూజలు

రామగిరి, నవంబర్ 13: హిందూ సంప్రదాయాల్లో కార్తిక మాసానికి ప్రశస్తి ఉంది. ఈ మాసంలో ప్రధానంగా పరమశివుడి, దాంతో పాటు విష్ణువును కూడా పూజిస్తారు. కార్తిక మాసంలో ఉపవాసాలు, వ్రతాలు, పూజలు, పుణ్య స్నానాలతో మాసమంతా సందడిగా ఉంటుంది. శివాలయాలతో పాటు వివిధ ఆలయాల్లో భక్తులతో కిట కిటలాడతాయి. పూజలతో భక్తి భావం పెరుగుతున్నది. ఈ మాసంలో శివాలయాల్లో కార్తిక దీపం, అర్చన, అభిషేకం, జ్వాల తోరణం, తులసీ కల్యాణం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతుండగా నవంబర్ 12 మంగళవారంతో ముగుస్తుండడం ప్రత్యేకత. దీంతో శివ,కేశవాలయాల్లో నూతన శోభ సంతరించుకొనుంది.

### కార్తికంలో వచ్చే విశిష్ట వేడుకలు

కార్తిక మాసంలో ఉపవాసం, జాగరణ , నదీ స్నానం, దాన ధర్మాలు చేయాలి. విష్ణువును తులసీదళాలు, మల్లె, కమలం, జాజి, అవిశ పూలు, గరిటెలతో పూజించాలి.

శివుని బిల్వ దళాలు, జిల్లేడు పూలతో పూజిస్తే ఎంతో పుణ్యం దక్కుతున్నదని భక్తుల నమ్మకం. కార్తిక మాసంలో 17న నాగుల చవితి, 25న శని త్రయోదశి, 27న కార్తిక పౌర్ణమి, 30న సంకట చతుర్థి, డిసెంబర్ 11న మాస శివరాత్రి వేడుకలు వస్తున్నాయి.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి : డీఎస్ఓ

తిప్పర్తి, నవంబర్ 13 : ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తిప్పర్తి, అంతయ్యగూడెం, రాయినిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 22,677మంది రైతుల వద్ద 1,64,350 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.167.86 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం నాగేశ్వర్ రావు, డీటీసీఎస్ లింగస్వామి పాల్గొన్నారు.



నార్కట్ పల్లి : అక్కెనపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని

### ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

నార్కట్‌పల్లి : మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ కాళిందిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సమాచారం త్వరగా ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులతో మాట్లాడుతూ ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని తప్పకుండా తూర్పారబట్టాలని తెలియజేశారు. ఆమె వెంట ఏపీఎం డి మైసేశ్వర రావు, సీసీ డి. రమాదేవి, సీబీఓ అడిటర్ సత్తిరెడ్డి, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



బుద్ధవనంలోని ఎంట్రెన్స్ ప్లాజా అశోక చక్రం నుంచి మహాస్తూపం వరకు దీపాలతో ర్యాలీ తీస్తున్న మాజీ ఎంపీ యశ్వంత్ అంబేద్కర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, బౌద్ధ అభిమానులు

# జీవితాల్లో వెలుగు నింపడమే ధమ్మ దీపోత్సవం

- బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నందికొండ, నవంబర్ 13 : అసమానతలు అనే అంధకారం తొలగించడానికి ప్రజల జీవితాల్లో వెలుగు నింపడానికి నిదర్శనంగా ధమ్మ దీపోత్సవం జరుపుకొంటామని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. నల్లగొండ జిల్లా నందికొండ పైలన్‌కాలనీలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు బుద్ధవనంలో ఆదివారం సాయంత్రం ధమ్మ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ, బీఆర్ అంబేద్కర్ మనుమడు, భారీపా బహుజన్ మహాసంగ్ పార్టీ అధ్యక్షుడు ప్రకాశ్ యశ్వంత్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుద్ధవనం ఎంట్రెన్స్ ప్లాజాలోని అశోక చక్రం నుంచి మహాస్థూపంలోని ధ్యానమందిరం వరకు దీపాలతో ర్యాలీ నిర్వహించారు. మహాస్థూపంలోని బుద్ధుడి ధాతువులు, బుద్ధ విగ్రహాలు, ఆచార్య నాగార్జున విగ్రహం చుట్టూ దీపాలు పెట్టి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఇల్లు విడిచి వెళ్లిన సిద్ధార్థుడు గౌతమ బుద్ధుడిగా తొలిసారి కపిలవస్తు నగరానికి వచ్చినప్పుడు ప్రజలంతా ఆనందోత్సాహాలతో ప్రతి ఇంటినీ దీపాలతో అలంకరించి దీపోత్సవాన్ని నిర్వహించుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి బౌద్ధులు ధమ్మ దీపోత్సవాన్ని నిర్వహించే సంప్రదాయాన్ని నెలకొల్పారన్నారు. ధమ్మ దీపోత్సవం నేపథ్యాన్ని వివరించి క్రమం తప్పకుండా బుద్ధవనంలో ధమ్మ దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ప్రకాశ్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ సమాజంలోని ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపడానికి నిదర్శనంగా బౌద్ధులు ధమ్మ దీపోత్సవాన్ని జరుపుకొంటారన్నారు. మంచి, చెడులను విశ్లేషించి మంచిని మాత్రమే స్వీకరించే నైతికతను జీవన విధానంగా బోధించిన బుద్ధుడి మార్గం ఆచరణీయమని పేర్కొన్నారు. బుద్ధవనం రానున్న రోజుల్లో అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధమ్మ దీపోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదన్నారు. అనంతరం బుద్ధుడి పాదాల వద్ద పూజలు నిర్వహించి మహాస్థూపంపై నుంచి ఆకాశంలోకి దీపాలను వదిలారు.

కార్యక్రమంలో బుద్ధవనం నిపుణులు ఈమని శివనాగిరెడ్డి, ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి, కేకే రాజా, కేవీఎల్ఎన్ మూర్తి, సహాయక శిల్పి శ్యామ్‌సుందర్, బౌద్ధ అభిమానులు పాల్గొన్నారు.